క్లుప్తంగా

తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


సత్యనారాయణ

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఖమ్మంకు చెందిన కవి, రచయిత బుక్కా సత్యనారాయణకు ఆహ్వానం అందింది. ఈ బ్రహ్మోత్సవాలు 9, 10 తేదీల్లో తిరుపతిలో జరగనుండగా, సత్యనారాయణను ఆహ్వానిస్తూ వేదిక చైర్మన్ ప్రతాప్ శనివారం లేఖ పంపించారు.

ఆలయానికి భూమి పూజ

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కంఠమేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఎంపీటీసీ ఊడుగు జ్యోతి, స్థల దాత అయితగాని హనుమంతరావు, బెల్లం వేణు, వెంకన్న, ఐతగాని వీరయ్య, మాజీ సర్పంచ్‌లు మాతంగి రామస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని రామాలయం 33 కేవీ సబ్‌స్టేషన్ కమాన్ బజార్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-5 ఏఈ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమాన్ బజార్, కస్బా బజార్, వల్లాల వారి వీధి, షాదీఖానా ప్రాంతం, స్టేషన్ రోడ్డు, బొమ్మన సెంటర్, శాంతి లాడ్జ్ ప్రాంతం, వినోదా థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వ్యర్థాలు వేసినందుకు జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని నూతన బస్టాండ్‌లోని స్టాల్స్, క్యాంటిన్ నిర్వాహకులు తమ సముదాయాల నుంచి వెలువడే వ్యర్థాలను ఖాళీ స్థలాల్లో పోస్తున్నారని కేఎంసీ అధికారులు శనివారం జరిమానా విధించారు. ఖాళీ స్థలంలో వేస్తున్న వ్యర్థాలకు రూ.3 వేలు జరిమానా విధించారు.

శివాలయంలో చోరీ

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి శివాలయంలో చోరీ జరిగింది. గ్రామంలోని శివాలయంలో శనివారం తెల్లవారుజామున చొరబడిన దుండగులు తాళాలు పగలగొట్టి హుండీ ఎత్తుకెళ్లారు. అలాగే, రెండు గంటలు కూడా చోరీ చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన వాచ్‌మెన్ ఇచ్చిన సమాచారంతో అర్చకుడు కోటేశ్వరరావుశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు నగదు తీసుకుని పొలాల్లో హుండీని వదిలేసి వెళ్లారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సర్పంచ్ కొండ్రు విజయలక్ష్మి, ఎంపీటీసీ ఉసిరికాయల లక్ష్మయ్య చేరుకుని వివరాలు ఆరా తీశారు.

కట్నం కోసం వేధింపులు

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరికి చెందిన కొర్లకుంట శైలజను అదనపు కట్నం తీసుకురావాలంటూ ఆమె భర్త, కుటుంబీకులు వేధిస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎనిమిదేళ్ల క్రితం పోలేపల్లికి చెందిన మురళీకృష్ణతో శైలజకు వివాహం జరగగా వీరికి ఒక పాప ఉంది. గత కొంతకాలంగా అదనపు కట్నం తీసుకురావాలని ఆమెను భర్త మురళీకృష్ణ, అత్త, ఆడపడుచులు, వారి భర్తలు వేధిస్తుండడమే కాక గత నెల 23న దాడి చేయగా గాయాలయ్యాయి. దీంతో శనివారం ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పత్రాలు లీక్ చేసిన వారిపై చర్య తీసుకోవాలి

తిరుమలాయపాలెం: మానవ వనరుల కేంద్రంలోని అధికారిక పత్రాలు లీక్ చేసిన వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంఈవో బి.వి రామాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయుల వ్యక్తిగత సమాచారమైన లీవ్ ప్రొసిడింగ్స్ ప్రయివేటు వ్యక్తుల చేతులకు వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శనం, ప్రభాకర్, యూటీఎఫ్ కార్యదర్శి సతీష్, అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాములు, వీరభద్రం, నాయకులు భాస్కర్, అనుమతీదేవి పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం, దసరా
సాయిరాం	బోళా
ఆదిత్య	దసరా
శ్రీనివాస	దాస్ కా దమ్కీ
సుందర్	రంగమార్తాండ

- ఖమ్మం గాంధీచౌక్

‘మేము సైతం’ సేవలు భేష్

- మార్గదర్శకులుగా ఉద్యోగులు, విద్యావంతులు
- విద్యార్థులు, యువతకు ఉచిత శిక్షణ, పుస్తకాల పంపిణీ

సండే స్పెషల్


సామాజిక సేవలో గ్రూపు సభ్యులు(ఫైల్)


శిక్షణలో పాల్గొంటున్న విద్యార్థులు

కూసుమంచి: సమాజానికి కొంత సేవ చేయాలని, అందుకు మేము సైతం ఉన్నామంటూ పలు సేవలు అందిస్తున్నారు కూసుమంచికి చెందిన మేము సైతం అనే వాట్సాప్ గ్రూప్ సభ్యులు. వీరు పలు సేవలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థులకు ఉచిత శిక్షణలు ఇప్పించటంతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి పుస్తకాలు సమకూర్చటం తదితర సామాజిక సేవలు అందిస్తున్నారు.

కూసుమంచి గ్రామంలో పలు ఉద్యోగాలు చేస్తున్న వారు, విద్యావంతులు 40 మంది కలిసి 2017లో మేముసైతం అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రూపు ద్వారా వారు నిధులు సమకూర్చుకుని విద్యార్థులకు, యువతకు పలు సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలోని లైబ్రరీకి రూ.2 లక్షల విలువైన పుస్తకాలు సమకూర్చారు. ఈ పుస్తకాలతో నిరుద్యోగ యువత చిన్న ఉద్యోగాల నుంచి గ్రూప్స్ వరకు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యారు. గ్రంథాలయంలోని ఫర్నీచర్ బాగు చేయించి చదువుకునేందుకు అనువుగా మార్పించారు. దీంతో పాటు సామాజిక బాధ్యతలను నిర్వర్తించేందుకు ముందుకు సాగుతున్నారు. దిశ ఘటన, మానస, టేకులక్ష్మీ తదితర ఘటనల సమయంలో విద్యార్థినులు, మహిళల భద్రతను గుర్తు చేస్తూ వారిని అప్రమత్తం చేసేందుకు కృషి చేశారు. రక్షణకు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లతో కూడిన పోస్టర్‌ల ద్వారా ప్రచారం చేపట్టారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ...

మేముసైతం గ్రూపు ద్వారా గురుకుల, ఏకలవ్య, తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణను అందిస్తున్నారు. కూసుమంచిలోని హైస్కూల్ పాత భవనాల్లో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఫ్యాకల్టీలను నియమించి విద్యార్థులకు శిక్షణను అందిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 60 మంది విద్యార్థులు ఈ శిక్షణను పొందుతున్నారు. మూడేళ్లుగా ఈ శిక్షణను ఉచితంగా అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.

మరిన్ని సేవలు అందిస్తాం



మేముసైతం అనే మా గ్రూపు ద్వారా సభ్యులు అందరం కలిసి పది మందికి మంచి మార్గాన్ని చూపించడం, వారు జీవితంలో స్థిరపడేందుకు సహాయం చేయటం ధ్యేయంగా పనిచేస్తున్నాం. మున్ముందు మరిన్ని సేవలు అందిస్తాం.

– రవీంద్రనాథ్ ఠాకూర్, రైల్వే ఉద్యోగి

రోజూ కోచింగ్‌కు వస్తున్నా



నేను నాలుగో తరగతి చదువుతున్నా. గురుకుల పరీక్ష రాసేందుకు రోజూ మా తండా నుండి కూసుమంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నా. ఇక్కడ మంచిగా పాఠాలు చెపుతున్నారు. ఈ కోచింగ్‌తో సీటు సాధిస్తా.

– గౌతమ్, విద్యార్థి, తుమ్మలతండా

ఇబ్బంది లేకుండా శిక్షణ



ఇక్కడ కోచింగ్ ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ప్రతి రోజు మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు శిక్షణను అందిస్తున్నాం. ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు నూరు శాతం సీట్లు సాధించేలా శిక్షణ అందిస్తున్నాం.

– లింగప్రసాద్, పర్యవేక్షకుడు

అక్రమ అరెస్టులు సరికావు

ఖమ్మం సహకారనగర్: సీఎం కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేస్తామని అసెంబ్లీలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని అరెస్ట్ చేయటం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అరెస్టులు చేయటం హేయమైన చర్య అన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల ఆగ్రహానికి గురికాక ముందే ఉత్తర్వులు ఇచ్చి రెగ్యులర్ చేయాలన్నారు.

కార్బైడ్ రహిత మామిడి మేళా

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌తో పాటు గాంధీచౌక్‌లోని మద్ది బాబురావు కాంప్లెక్స్‌లో కార్బైడ్ రహిత మామిడి మేళా ఏర్పాటుచేసినట్లు కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన ఆదర్శ రైతు బానోతు లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి రసాయనాలు వాడకుండా పండించిన మామిడి విక్రయిస్తున్నామన్నారు. పది కేజీలకు పైగా కొనుగోలు చేసిన వారికి డోర్ డెలివరీ ఉంటుందని తెలిపారు. రవీందర్ పాల్గొన్నారు.

శ్రీబాలాజీ బ్రహ్మోత్సవాలు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 5న స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తుండగా భక్తులు పాల్గొనాలని ఆలయ ప్రధానార్చకులు శ్రీపరాశర సంపత్ కుమార్ భట్టార్ కోరారు.

రంజాన్ మాసానికి మరేది సాటిరాదు..


మహ్మద్ అబ్దుల్ ఖవీతో చర్చిస్తున్న ముస్లింలు

ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మం అర్బన్: ఆధ్యాత్మిక ఆనందం, ఆరోగ్య జీవనానికి రంజాన్ అద్భుత మాసమని.. దీనికి మరేది సాటి రాదని దీని మదర్సాల సలహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖవీ తెలిపారు. రంజాన్ నెలలో చేసే పుణ్యకార్యాలు, పాటించే ఉపవాసాలు, ఆహార నియమాలతో మనిషి సంపూర్ణ జీవితాన్ని ఆస్వాదించగలుగుతాడని చెప్పారు. నగర శివారు గొల్లగూడెంలోని ఇదారా తాలీముల్ ఇస్లాం మదర్సాలో శనివారం ఖత్మే ఖురాన్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖవీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రంజాన్ మాసంలో చేసే ప్రతీ దైవ కార్యానికి ఏడు రెట్ల పుణ్య ఫలం లభిస్తుందని తెలిపారు. చిన్నచిన్న కారణాలకు ఉపవాసాన్ని నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. ముస్లింలు అధికంగా నివాసముండే ప్రాంతాల్లో మొహల్లా కమిటీలు ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖవీని తాలిముల్ ఇస్లాం మదర్సా ట్రస్టు సభ్యులు, నిర్వాహకులు సత్కరించారు. మదర్సా కరస్పాండెంట్ ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మీ, ముఫ్తీ జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై అశ్రద్ధ చేయొద్దు


ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న విద్యాచందన

ఖమ్మంరూరల్: మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని, అశ్రద్ధ చేయొద్దని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీఆర్‌డీఓ ఎం. విద్యాచందన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఈ కార్యక్రమం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైందని, మహిళలకు అన్ని రకాల వ్యాధులకు సంబంధిత పరీక్షలు, వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఎం.వెంకటాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో ప్రతీ మంగళవారం ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, వైద్యం అందిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఏపీఓ శ్రీదేవి, ఏపీఎం పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెర్ప్ సిబ్బందికి పేస్కేల్ అమలుపై హర్షం

కామేపల్లి(కారేపల్లి): సెర్ప్ సిబ్బందికి ప్రభుత్వం జీవో నెంబర్ 11ను అమలు చేస్తూ పేస్కేల్ ఇస్తుండటంతో డీఆర్‌డీఓ విద్యాచందన హర్షం వ్యక్తం చేశారు. శనివారం కామేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమానికి హాజరై డ్వాక్రా మహిళలకు, సెర్ప్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఎస్‌కె సిలార్‌సాహెబ్, ఏపీఎం కె.సురేందర్‌బాబు, ఏపీఓ శ్రీరాణి, సీసీలు కె.వీరభద్రం, మల్లయ్య, వీరయ్య, సరోజిని, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తమలపాకులతో అర్చన


పండితులను సన్మానిస్తున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ రామనవమి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని గాంధీచౌక్‌లో శనివారం తమలపాకుల అర్చన, సదస్యం కార్యక్రమాలను నిర్వహించారు. కనమర్లపూడి శ్రీనివాస్–రజిని బృందం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వజ్రపు మోహన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పండితులను నవమి వేడుకల కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

మెడికల్ షాపుల్లో రాయితీ ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: మెడికల్ షాపుల్లో మందుల కొనుగోలుపై జర్నలిస్టులకు 20 శాతం మేరకు రాయితీ కల్పించాలని ఖమ్మం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు శనివారం డ్రగ్స్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేషన్ ఏడీ జి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు చక్రవర్తి, బిక్కి గోపి, జీవన్‌రెడ్డి, పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, శ్రీనివాస్, నాగేశ్వరరావు ఉన్నారు.

మహిళలకు రక్షణ కరువు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో మహిళలకు రక్షణ కరువైందని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర సభ్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.... బాల, బాలికల సంక్షేమ పాఠశాలల్లో పిల్లలకు పురుగులతో కూడిన భోజనం పెట్టిన ప్రభుత్వం ఇప్పుడు తన బిడ్డ కోసం మహిళా రిజర్వేషన్ బిల్లు గుర్తొచ్చిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి చెందుతుందన్నారు. ముందుగా జిల్లా ఆస్పత్రిలో పర్యటించి వైద్యం పట్ల రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు ఉప్పల శారద, జిల్లా ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు దొడ్డా అరుణ, అనిత, శ్రీదేవి, మందా సరస్వతి, సుగుణ, రజినిరెడ్డి, భవాని పాల్గొన్నారు.

‘లిటిల్ ఇండియన్స్’ వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని లిటిల్ ఇండియన్స్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామచంద్రరావు, కార్పొరేటర్లు కమర్తపు మురళి, షేక్ మగ్బుల్, ఎం.లక్ష్మీ మనోహర్, పాఠశాల కరస్పాండెంట్ పి.జ్యోత్స్నశంకర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతీ తరగతిలో మొదటి రెండు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో ‘బొమ్మ’ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో కాలేజీ చైర్మన్, వైస్‌చైర్మన్ తదితరులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని బొమ్మ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు బీటెక్ చివరి సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థులను వారు అభినందించి మాట్లాడారు. సెక్రటరీ ఉదారు శ్రీధర్, డైరెక్టర్ మాధవి, హెచ్‌ఓడీ నగేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరామర్శ..


నివాళులర్పిస్తున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురానికి చెందిన మకనబోయిన రేణుక (47) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా ఆమె మృతదేహాన్ని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యక్తిగత సహాయకులు నంద్యాల రవీందర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎండపల్లి వెంకయ్య, తోట చినవెంకటరెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే కందాళ..

రేణుక మృతదేహాన్ని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సందర్శించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. బెల్లం వేణు, గూడా సంజీవరెడ్డి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల సర్వే

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి, వి.వెంకటాయపాలెం, గణేశ్వరం, ఈర్లపూడి, డొనబండ, లచ్చిరాంతండాల్లో దెబ్బతిన్న దెబ్బతిన్న పంటలను ఏడీఏ శ్రీనివాస్, ఏఓ భాస్కర్‌రావు శనివారం సర్వే చేశారు. మొక్కజొన్న, ఇతర పంటలు దెబ్బతిన్న రైతుల పొలాలను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. సర్పంచ్ మెంటెం రామారావు, ఏఎంసీ డైరెక్టర్ తాతా వెంకటేశ్వర్లుతో పాటు తమ్మిని నాగేశ్వరరావు మాలోత్ రాంబాబు, తొలపునూరి దానయ్య, పోతగాని పుల్లయ్య, ఊర్లుగొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇస్రో సందర్శన



ఇస్రో వద్ద ఎస్‌బీఐటీ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బిఐటీ కళాశాల ఈసీఈ విద్యార్థులు 50 మంది హైదరాబాద్‌లోని జీడిమెట్లలోని ఇస్రోను సందర్శించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం క్షేత్రస్థాయి ప్రదర్శనలో భాగంగా శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు విద్యార్థులకు రాకెట్లు, అంతరిక్షంలో ఉపగ్రహాలు వాటి ఆవిర్భావం తదితర అంశాలపై అవగాహన కల్పించారన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు ఏవివి శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో వ్యర్థాలు వేయొద్దు


వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: వ్యాపారులు తమ సముదాయాల ఎదుట ఉన్న డ్రెయినేజీల్లో ఖాళీ బాటిల్స్, వ్యర్థాలు వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. శనివారం నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో గోళ్లపాడు చానల్‌పై నిర్మాణంలో ఉన్న పార్కులను, నూతనంగా నిర్మించిన డ్రెయినేజీలను పరిశీలించారు. వ్యర్థాలు, ఖాళీ బాటిల్స్ గమనించిన కమిషనర్ పక్కన ఉన్న దుకాణదారులతో మాట్లాడారు. గోళ్లపాడు చానల్‌పై నిర్మాణంలో ఉన్న పార్కులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రంజిత్, డీఈలు ధరణి, రంగారావు, ఏఈలు సతీష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


మందులు అందజేస్తున్న నున్నా నాగేశ్వరరావు, వైద్యులు

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేట్ కంపెనీల లాభాల కోసమే కేంద్ర ప్రభుత్వం మందుల ధరలు పెంచిందని, ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మం మంచికంటి హాల్‌లో సీపీఎం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం(బీవీకే) ఆధ్వర్యంలో నెల నెలా మెడికల్ క్యాంపులో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, బీవీకే మేనేజర్ వై.శ్రీనివాసరావు, ప్రముఖ డాక్టర్లు సి భారవి, కొల్లి అనుదీప్, రావిళ్ల రంజిత్, పిల్లలమర్రి సుబ్బారావు, జెట్ల రంగారావు, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, శివనారాయణ, వాసిరెడ్డి వీరభద్రం, అఫ్జల్, వాసు, కాంపాటి వెంకన్న, జె.వెంకన్న బాబు, రామారావు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వాసవి క్లబ్ ప్రతినిధులు తెల్లాకుల వెంకటేశ్వరరావు మెటీరియల్ అందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దోసపాటి చంద్రశేఖర్, రేగూరి హనుమంతరావు, ఎంపీటీసీ రేగూరి వాసవి, జయశ్రీ, అశోక్, కరుణ పాల్గొన్నారు.

పరీక్షలకు సర్వంసిద్ధం


నంబర్లు కేటాయిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాల, నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెరువుమాధారం ప్రభుత్వ పాఠశాలలను పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం కేంద్రాల్లో నంబర్లు వేశారు. పరీక్షలు విజయవంతంగా జరిగేలా సహకరించాలని ఎంఈఓ బి.రాములు కోరారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు అనైతికం


రఘునాథపాలెం: మాట్లాడుతున్న జావేద్


కామేపల్లిలో మాట్లాడుతున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ నాయకులు, ఎంపీ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం బీజేపీ కేంద్ర ప్రభుత్వం అనైతికతకు నిదర్శనమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్ది వీరారెడ్డి, చింతమళ్ల. రవికుమార్, గోనె. భుజంగరెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది ముమ్మాటికీ కక్ష్య సాధింపే

కామేపల్లి(కారేపల్లి): బీజేపీ ప్రభుత్వం రాహుల్‌గాంధీపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతుందని, ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాతలింగాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడగా మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యనారాయణ, ఎంపీటీసీలు రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, సొసైటీ డైరెక్టర్ గుజ్జర్లపూడి రాంబాబు, సర్పంచ్ కె.నాగయ్య, వెంకటనర్సయ్య, ఆలోత్ శివ, భాష్‌సింగ్, ముక్తి సాంబశివరావు, సీహెచ్ విశ్వనాథం, వినోద్ పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సత్యాగ్రహదీక్షను ప్రారంభించారు. అనంతరం కేంద్రం దిష్టి బొమ్మ దహనం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కూసుమంచి: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికం అని, అందుకు ప్రధాని మోదీ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య కూసుమంచిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ జంగం లక్ష్మీనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు మట్టె గురవయ్య, ఎండి.హఫీజుద్దీన్, చెన్ను వెంకటరమణ, కొండా శ్రీనివాస్, బాబు నాయక్ పాల్గొన్నారు.

రఘునాథపాలెం: దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణచూసి తట్టుకోలేక భయం పట్టుకొని బీజేపీ తప్పుడు ఆరోపణలతో వేధింపులకు పాల్పడుతుందని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎండి. జావేద్ అన్నారు. మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేటర్ మల్లీడు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ భూక్యా బాలాజీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రెంటాల ప్రసాద్, నాయకులు కొంటి ముక్కల వెంకటేశ్వర్లు, మారం కరుణాకర్‌రెడ్డి, మాధంశెట్టి హనుమంతరావు, వెంకన్న, హరిసింగ్, తావిర్యా, మధు, క్రిష్ణ, శివ, చంద్రరావు, ఏలూరి రవికుమార్ పాల్గొన్నారు.